
# కోతిచేతికి పూలమాల



కలువకొలను సదానంద

**చేతికర్ర ఊతగా, వడవడ వణుకుతూ చిన్నగా - చిరుగాలికి పడిపోయేటంత తేలిగ్గా రైలుకట్ట వెంబడి నడిచిపోతున్నాడు తిమ్మరాజు.**

మంచుతెరలు మెల్లమెల్లగా విచ్చిపోతున్నాయి. తూరుపుదిక్కున పసిడికాంతులు పరచుకొంటున్నాయి. చలి అణగక దుప్పటి మరింత గట్టిగా కప్పుకొన్నాడు తిమ్మరాజు.

ఎక్కడికి పోతున్నాడు తాను? ఏమో, తనకే తెలియదు. ఎక్కడికైనా సరే, వెళ్లిపోవాలి! ఈ ఊరికి దూరంగా వెళ్లిపోవాలి!

పక్కన - తుమ్మచెట్లో పిట్ట ఎక్కడికో వెళ్లిపోతున్నది. పాపం, అది మళ్లీరాదా? ఎందుకు రాదూ? తప్పక వస్తుంది. దాని పిల్లలకోసమైనా రావాలి!

తనకూ ఉన్నాడు కొడుకు. కానీ, తాను వెను దిరిగిపోడు. వాడు తన కొడుకు అని నలుగురితోనూ సంతోషంగా చెప్పుకోలేడు. "నాయనా, నా తండ్రీ!" అంటూ వాణ్ని కౌగిలించుకుని ఆనందించడానికి తాను నోచుకోలేదు. తండ్రి ప్రాపు లేకుండా పెరిగిన అభాగ్యుడి దగ్గరకు 'నేను నీ తండ్రిని' అని ఏ మొగంతో వెళ్లగలడిప్పుడు?

అందుకే, మరెక్కడికో వెళ్లిపోతున్నాడు.

ఉదయాతపం - తిమ్మరాజు చలిని పోగొట్టడానికన్నట్లు అతనిమీదికి అల్లుకొంది. చెట్లమీద పరచు కొన్న మంచు ఉదయకిరణాల తాకిడికి కరిగి, నీటిముత్యాలై కిందికి రాలుతోంది.

* * *

ఎండలో తలమాడితేనేగానీ, తరుచ్ఛాయలోని చల్లదనపు సౌఖ్యం తెలియదు.

వయస్సులో తిమ్మరాజు మంచి అందగాడు. అందానికి మించిన సద్గుణ సంపన్నుడు. పూలకు మల్లెనే పరిమళ హృదయుడు.

ముప్పైయేళ్లు పైబడినా పెళ్లిపెడాకులూ లేకుం డా ఉండిపోయిన తిమ్మరాజు గరుడయ్య దృష్టిని ఆకర్షించాడు.

గరుడయ్య కొండల్ని పిండిజేసి, మిట్టాపల్లం ఏకంచేసి, కొంత భూస్థితి సంపాదించుకొన్నాడు. ఊరిపెద్దలతో ఎడతెగని స్నేహం ఉన్నందువల్ల పలుకుబడికి లోటు లేదు. కానీ, అతనికి మగసం తానం అన్నది లేదు. ముగ్గురూ ఆడపిల్లలే! ఇద్దరు కూతుళ్లను దూరప్రాంతాల్లో ఇచ్చాడు. చిన్న కూతురు మీనాక్షే ఇక మిగిలి ఉంది. ఆమెకు ఈడు వచ్చేసరికి గరుడయ్యకు దిగులు పట్టుకొంది. తన కా, వయస్సు చెల్లిపోతున్నది. ఆప్తులంటూ అందు బాటులో ఎవరూ లేరు. మిగిలివున్న ఒక్క కూతుర్నీ ఇంకెక్కడో ఇచ్చాడంటే, తాను ఒంటరిగా మిగిలి పోతాడు. వార్ధక్యంలో తనకు అండ అంటూ ఉండ దు. అందుకే, అతని ఆలోచనలు తిమ్మరాజు మీదికి మళ్లేసరికి, పేదవాడికి పెన్నిధి దొరికినంత సంతృప్తి కలిగింది. అసలు - తిమ్మరాజు స్థితిమం తుడేమీ కాదు. ఊరి చివర మూడేసి అంకణాల పూరిళ్లు రెండు, చుట్టూరా కొంత ఖాళీస్థలం అతనికున్న ఆస్తి. బజారులో పూలదుకాణం ఉంది. పూలదండలు కట్టడంలో నేర్పున్నవాడు. మంచి వ్యాపారం. ఇది చాలు, తన కూతురు సుఖంగా జీవించటానికి! ఇంకా సంబంధ ప్రయత్నాలైనా చేయకముందే తిమ్మరాజు విధవతల్లి ఉన్నట్టుండి చనిపోవడంతో, ఇక మీనాక్షికి అత్తపోరు కూడా ఉండబోదనుకున్నాడు గరుడయ్య.

పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోయింది. దేవుడు దిగి వచ్చి వరమిస్తానంటే వద్దనే వాడెవడూ ఉండడు. తిమ్మరాజు మురిసిపోయాడు. కొత్త పెళ్లాంతో కాపు రం పెట్టాడు.

గరుడయ్యకు నెత్తిమీదినుండి పెద్దకొండ దింపినట్లయింది. కూతురు తనకళ్ల ఎదుటనే ఉం టుంది. తనకిక ఏం బెంగా లేదు. ఇక ఎంతోకాలం జీవించబోడు తాను. కానీ, పుట్టినమట్టిలోనే కలిసి పోతానన్న తృప్తి మిగిలింది. బిడ్డలకు దూరంగా దిక్కులేని చావుచావాల్సిన దుర్గతి మాత్రం పట్టదు. ఇక రామా, కృష్ణా అనుకుంటూ శాంతంగా రోజులు వెళ్లబుచ్చాలనుకున్నాడు.

రెండేళ్ల దాంపత్యజీవితం పచ్చగానే గడిచి పోయింది. మీనాక్షికి - పూరింట్లో తిమ్మరాజు సాహ చర్యంలో ఏ కొరత కనిపించేది కాదు. వారి దాంప త్యం, అన్యోన్యానురాగం అందరికీ చూడముచ్చట గొలిపేది.

అటువంటి తిమ్మరాజు ఉన్నట్లుండి అలా మారిపోతాడని ఎవరూ కలలోనైనా అనుకోలేదు.

* * *

ఓ రోజు మధ్యాహ్నానంతరం -

తలొంచుకుని పువ్వులల్లుకుంటుంటే - "మూరెడు పువ్వులిస్తావా?" అంది ఓ స్త్రీ కంఠం.

పువ్వులందిస్తూ ఆమెవైపు చూశాడు తిమ్మ రాజు. చాలా అందంగా ఉందామె. పాలికేళ్లుం టాయి. సిగలో మల్లెలుముడుచుకుంటూ, ముఖాన మల్లెచెండు విసిరినట్లు నవ్వింది.

వచ్చే బస్సులు వస్తున్నాయి. వెళ్లే బస్సులు వెళ్తున్నాయి. సాయంకాలమైనా ఆమె మాత్రం అక్కణ్నుంచి కదల్లేదు. దుకాణం ముందర నీడ లోనే ఒదిగి నుంచుంది.

"ఏ ఊరెళ్లాలి?" అన్నాడతను.

"ఏ ఊరూ లేదు."

"ఎవర్నువ్వు?"

"ఈ ఊరు కాదు."

"ఇంకే ఊరు?"

"... చాలా దూరం!"

మరికొన్ని నిమిషాల తర్వాత "ఈ ఊళ్లో ఎక్కడన్నా చిన్నఅద్దెఇల్లు చూసిపెడతావా?" అందామె.

"ఇంకెవర్నయినా అడక్కపోయావా?"

"ఇంకెవర్నీ అడగాలనిపించలేదు ..." అంటూ నవ్వింది.

మరో నిమిషంపాటు మౌనంగా ఉండి, "నీ పేరు?" అన్నాడతను.

"కనకరత్నం" అంటూ అతని కళ్లలోకి చూసిం దామె.

పొద్దుపోయాక ఆమెను వెంటబెట్టుకుని ఇంటి కి వెళ్లాడు తిమ్మరాజు. మీనాక్షి గుమ్మంలోనే నిల బడి ఉంది.

తిమ్మరాజు గబగబ రెండో ఇంటిలోపలికి వెళ్లి కనకరత్నాన్ని అందులో దిగవిడిచి వచ్చాడు.

"ఎవరండీ ఆమె?" అంది మీనాక్షి.

"చెబుతాలే! వేణ్నీళ్లు తోడు."

మీనాక్షి పెరట్లోకి వెళ్లి అతనికి స్నానానికి వేడి నీళ్లు తోడింది. అతని వీపు రుద్దుతూ, "ఆవిడ ఎవరో చెప్పరూ?" అంది.

"ఎవరైతే మనకెందుకూ? ఇల్లు కావాలంటేను, తీసుకొచ్చా ..."

"ఇల్లుకావాలంటే, అద్దెకొంపలే లేకపోయా యా?" అంది మీనాక్షి ఆశ్చర్యంగా.

"ఏం, మనిల్లు ఎందుకివ్వగూడదూ?"


"మనిల్లా? బాగుంది. మనకే చోటుచాలక ఇబ్బంది పడుతూంటే, ఉన్నఇల్లు కూడా అద్దెకిచ్చు కోవడమా? ...అయినా మన మధ్యని వేరే కాపురాలే మిటండీ? ..."


"రెండిళ్లు మనకెందుకులే! ఒకటి చాలదూ? ఇన్నాళ్లూ అద్దెకిచ్చుకోలేదు. ఇప్పుడిస్తే ఏం? డబ్బూ కలిసొస్తుంది. నువ్వూరుకో! అంతా నాకు తెలు సులే!" అతను మాట్లాడుతున్నంతసేపు భార్యకు ముఖం చూపించలేకపోయాడు.

తిమ్మరాజు భోజనం చేస్తున్నంతసేపు ఇద్దరూ మౌనంగానే ఉన్నారు. అతను చేయికడుక్కున్న తర్వాత "ఏమండీ! మన సామానులంతా ఆ ఇంట్లో నే ఉన్నాయి ..." అంది మీనాక్షి.

"ఫరవాలేదులే! రేపు తెచ్చుకోవచ్చు. ఇప్పుడు పరుపూ దుప్పటీ మాత్రం తెస్తా. నిద్దరొస్తోంది..."

ఆ రాత్రి అవతలి ఇంట్లోంచి గాజుల చప్పుళ్లు,





## జలకాలాటలలో ...

నీళ్లొచ్చే పంపు దగ్గర పిల్లల్ని సెలవురోజున వదిలితే చాలు, చస్తే ఇవతలికి రారు. పెద్దయ్యాక కూడా కొందరు ఇలా చిన్నపిల్లల్లా ప్రవర్తించాలనుకుంటారు - అందుకు సరైన పంపు దొరికితే.

ఇలాంటి వాళ్లని దృష్టిలో ఉంచుకుని ఫ్రాన్స్‌లో ఈ పెద్ద నీళ్ల పంపుని ఏర్పాటు చేసిందో వ్యాపార సంస్థ. ఆరోగ్యం కోసం సైకిలింగ్ చేసే ట్రాక్‌కి సమీపంలో ఉన్న ఈ పంపు కింద కొంత రుసుము (ఒకటిన్నర ఫ్రాంకులు) చెల్లించి పదిహేను నిమిషాలసేపు జలకాలాడవచ్చు.

- పృథ్వీ

పాడిదగ్గులు, ఆవులింతలు! తన భార్య నిద్రపోయిందోలేదో గమనించడంతోనే మూడుజాములు గడిచిపోయాయి తిమ్మరాజుకు.

నాలుగు రోజులు గడిచాయి. మీనాక్షి తన గుట్టుకనిపెట్టినట్లుంది. భర్తను చూచినప్పుడల్లా గుడ్లనీరు కుక్కుకుంటుంది. కనకరత్నం కనిపించినప్పుడల్లా పాములా బుసలు కొడుతుంది. సూటిపోటి మాటలంటుంది.

ఆరోజు మధ్యాహ్నం తిమ్మరాజు భోజనానికి ఇంటికి వచ్చి, కాళ్లు కడుక్కోవటానికి పెరట్లోకి వెడుతుంటే - "ఇలా ఓసారి వస్తారా?" అంది కనకరత్నం.

అతను వెళ్లాడు. కనకరత్నం కళ్లు మేఘాలై వర్షించాయి. "చూడు, నీ పెళ్లాం ఏం చేసిందో! నా ఒళ్లంతా హూనమైపోయింది. నా జుట్టంతా ఊడిపోయింది. వెళ్లిపొమ్మని మెడపట్టి గెంటింది. నేను బజారుముండనట! నీకు సిగ్గులేదట. నాకు శరం లేదట! ... నేను వెళ్లిపోతాను బాబూ! నా కోసం నువ్వెందుకు మాటలు పడాలి?"

తిమ్మరాజు ఇంట్లోకి వెళ్లాడు. మీనాక్షి అన్నం వడ్డించి ఉంచింది. అతను ఆమెకేసి చురచురా చూసి, మళ్లీ కడప దాటుకొపోయాడు.

"భోంచేయరా?" అంది మీనాక్షి.

తిమ్మరాజు - వడ్డించి ఉన్న కంచాన్ని కోపంతో ఒక్క తన్ను తన్ని "ఛీ! కుక్కలు కూడా ముట్టకోవు నీ చేతి అన్నాన్ని! మెత్తగా ఉంటున్న కొద్దీ కొవ్వెక్కిపోతున్నావు. గుట్టుగా ఇంట్లో పడి వుంటే ఉండు. కాట్లకుక్కలా ఊళ్లోవాళ్ల మీదికి వెళ్లావంటే ముక్కలు ముక్కలుగా నరికి కాకులకూ గద్దలకూ వేస్తా, జాగర్త!" అంటూ రొప్పుతూ వాకిట్లో మంచం మీద కూలబడ్డాడు.

కనకరత్నం అవతలి ఇంటి వాకిట్లో నిలబడి చూస్తోంది. మీనాక్షి ఈ అవమానాన్ని సహించలేకపోయింది. కోపంతో బుసలు కొడుతూ వడివడిగా కనకరత్నం దగ్గరికి నడిచివెళ్లి, "నా మొగుడికేం నూరిపోశావే మంత్రాలమారీ! నువ్వెక్కడ దాపరించావే నాకు, చుప్పనాతీ!" అంటూ రెండు చెంపలూ చురుగ్గా వాయించేసింది.

తిమ్మరాజు ప్రళయకాలరుద్రుడిలా పైకి లేచాడు. వచ్చే ప్రాణం, పోయే ప్రాణం తెలియకుండా మీనాక్షిని చావబాదేశాడు. ఆమె కేకలువిని నలుగురూ అక్కడ గుమిగూడారు. అతని బారినుంచి ఆమెను విడిపించారు.

ఎవరి ద్వారానో ఈ విషయం విన్న గరుడయ్య సుడిగాలిలా వచ్చిపడ్డాడు. ఒళ్లు హూనమయ్యేలా దెబ్బలుతిని పడివున్న కూతుర్ని చూసేసరికి అతని కడుపు తరుక్కుపోయింది. "ఒరేయ్ పూలోడా! నీ కిదేం పోయేకాలంరా? తెలిసి తెలిసీ గతిలేనివాడికి అంటగట్టానే, నాదీ తప్పు! ... దిబ్బలు వెతికే బుద్ధెక్కడికి పోతుంది? పువ్వుల్లో పెంచి ముళ్లల్లో ఉంచాను ... థూత్!" అంటూ తిమ్మరాజు ముఖం మీద ఖాండ్రించి ఉమ్మేశాడు.

ఇంకా కోపం చల్లారని తిమ్మరాజు ముందు వెనుకలాలోచించక, 'నీ కూతురు అంత సుకుమారైతే, నీతోనే తీసుకెళ్లు! ఇక్కడెందుకు? నా కెందుకీ పీడ?'అన్నాడు.

"ఆ మాట నువ్వు చెప్పాలేమిట్రా ముష్టివెధవా! ఇదో, ఇప్పుడే తీసుకువెడుతున్నా!"అని కూతురి చెయ్యి అందుకుని, "లేమ్మా, వెళ్దాం మనింటికి! ఈదరిద్రపుకొంపలో దేనికి?"అన్నాడు గరుడయ్య. అంతవరకు ఏడ్చిఏడ్చి అలసి పోయి వెక్కిళ్లుపడుతోన్న మీనాక్షి "నువ్వెళ్లు నాన్నా! నేనురాను" అంది.

"ఇంకా ఈ కసాయివాడిమీద ఆశ పెట్టుకుంటావా తల్లీ? వీడు ఏనాటికైనా నిన్ను ఖూనీ చేసేవాడే! అక్కడ నీకేమీ లోటుండదురామ్మా! ఇక్కడుండి, ఎందుకు దిక్కులేని చావుచస్తావు?" అంటూ గరుడయ్య ఆమెను పైకి లేవనెత్తాడు.

"వెళ్లే! నీకేం కొరత? ఇంకో మొగుణ్ని కట్టబెడతాడులే!" అంటూ కసిగా నవ్వాడు తిమ్మరాజు.

గరుడయ్య కళ్లు చింతనిప్పుల్లా మెరిశాయి. "ఏం కూశావురా గాడిదా!" అంటూ దుడ్డుకర్రతో బలంగా ఒక్కదెబ్బ వేశాడు అతని తలపైన. తలకు పెద్ద గాయమై రక్తం చిమ్మింది.

మీనాక్షి "నే రా"నంటూ గింజుకొంటున్నా వినిపించుకోకుండా ఆమెను తన ఇంటికి లాక్కెళ్లిపోయాడు గరుడయ్య.

అప్పటికి ఆమె నిండు చూలాలు.

* * *

తాడు తెగిన గాలిపటంగా మారిన తిమ్మరాజు అన్నిటికీ తెగించి, కనకరత్నంతో కాపురం పెట్టాడు. గరుడయ్య కూతుర్ని మళ్లీ పంపించలేదు. తిమ్మరాజు రమ్మని పిలవనూలేదు.

రోజులన్నీ కనకరత్నంమీది మోజుతోనే గడిచిపోతున్నాయి. మీనాక్షి కొడుకును కన్నది. తాను చూచిరావడానికైనా వెళ్లలేదు.

కనకరత్నం ఉదంతం కొన్నాళ్లలో అందరికీ తెలిసింది. కట్టుకున్నవాడి కంట్లోకారంకొట్టి,

పరాయివాడితో లేచిపోయిందామె. లేవదీసుకు వచ్చినవాడు ఆమెను నట్టేట్లో వదిలి మాయమై పోయాడు. గాలానికి చేప తగులుకొన్నట్లు తిమ్మ రాజు ఆమె వలపువలలో చిక్కుకున్నాడు.

ఏళ్లు దొర్లిపోతున్నాయి. తన కొడుకు గోపాలం - తన పూలదుకాణం ముందునుంచి వెడుతోంటే తిమ్మరాజు చాలాసార్లు చూశాడు గానీ, పలకరించ లేదు. అతని రోషం కింద పుత్రవాత్సల్యం అణగి పోయింది.

తాను మీనాక్షిని పరిత్యజించిన పదిసంవత్స రాలకు తన మామగారు గరుడయ్య మరణిం చాడు. బాకీలకు పోగా మిగిలిన ఆస్తిని ముగ్గురు కూతుళ్లూ పంచుకున్నారు. మీనాక్షి వాటాకు పది వేలు విలువచేసే డాబా ఇల్లు వచ్చింది. తిమ్మరాజు మామగారి చావుకు కూడా వెళ్లలేదు.

కొడుకు కోసం మీనాక్షి నానా కష్టాలూ పడింది. గోపాలాన్ని బి.కాం. దాకా చదివించింది. అదృష్టం కొద్దీవాడికి మంచిఉద్యోగమే దొరికింది. కొడుక్కి తన చేతులారా పెళ్లి చేయవలసిన తిమ్మరాజు కొడుకు పెళ్లికైనా వెళ్లలేదు.

కనకరత్నం వ్యాధిగ్రస్తురాలై చనిపోయింది. తుదిక్షణాలలో ఆమె తన పాపాన్ని పశ్చాత్తాపంతో కడిగివేసుకొంది. "నీ సంసారాన్ని ముక్కలు ముక్క లు చేశాను. నీ పెళ్లాం పిల్లల్ని వేరుచేసి, వాళ్ల గోడు పోసుకున్నాను. దేవుడి దగ్గిర ఏమని సమాధానం చెప్పుకోను నేను?" అంటూ ఏడ్చింది ఆమె.

ఇంతటి దీర్ఘకాలంలోనూ ముందుచూపన్నది లేకపోయింది తిమ్మరాజుకు. ఇప్పుడు తాను ఏకాకి! ఈనాడు హృదయం గతజీవితాన్నంతా పునరా లోకనం చేసుకుంటూ పశ్చాత్తప్తమైపోయింది.

* * *

తిమ్మరాజు రైలుకట్టమీదే నడిచిపోతున్నాడు.

ఆకాశం నెత్తిమీది మణికిరీటంలా ధగధగ లాడుతున్నాడు సూర్యుడు.

కనుచూపుదూరాన ఏదో రైలుస్టేషను కాబోలు కనిపిస్తోంది. కొన్నిగజాల దూరంలో రైలుకట్టకు సమానాంతరంగా తారురోడ్డు. తిమ్మరాజు రోడ్డు మీదికి వెళ్లాడు. బాటకు ఇరువైపులా నేరేడుచెట్లు, చింతచెట్లు బారులుతీరి నిలబడి ఉన్నాయి. బాట పక్కన ఒక చిన్నబడ్డీకొట్టు. దాపున పెద్దమర్రి చెట్టు.

ఆకలిబాధ వల్ల శరీరం నీరసంగా ఉంది. తేలి గ్గా అడుగులు వేసుకుంటూ మర్రిచెట్టు కిందికి వెళ్లాడు తిమ్మరాజు. కొంతమేర శుభ్రం చేసి, ఒక రాతిని తలకింద పెట్టుకొని పడుకున్నాడు.

అక్కడక్కడా - ఎవరో వంట చేసుకున్నట్లు - బొగ్గులు, పొయ్యిరాళ్లు పడి ఉన్నాయి. ఈ చెట్టు ఎందరు అనాథలకు ఆశ్రయమిచ్చిందో? తనకూ ఇప్పుడు ఆశ్రయమిచ్చింది. తాను దిక్కులేనివాడు. తనవారు అని చెప్పుకోదగ్గ వా రెవరూ లేరు. తాను భిక్షగాడు! ఎంతమంది ముష్టెత్తుకొని బతకటం లేదు? తానూ అంతేనా ఇక? ...

అతని మనోవేదనను ఉపశమింపజేసేందు కన్నట్లు ఆ చల్లటినీడలు అతనికి సుఖనిద్రను ప్రసాదించాయి.

* * *

మూడు రోజులు గడిచాయి.

ఈ మూడు రోజుల్లో ఆ వృద్ధుడు చాలా మారిపోయాడు. ఎవరు పలకరించినా, ఉలకడు, పలకడు. జీవచ్ఛవంలా అక్కడే పడి ఉంటాడు. పిచ్చిపిచ్చిగా గొణుగుతాడు. ఏడుస్తాడు. కాస్సేపు తనలో తానే నవ్వుకుంటాడు. గంటల తరబడి శూన్యంలోకి చూస్తూ ఉండిపోతాడు. తన పాదాల దగ్గర కూలిపోయిన ఆ శరణార్థిని లేవనెత్తి ఓదార్చ లేక మర్రిచెట్టు ఆక్రోశిస్తుంది.

దయతలచి ధార్మత్ములెవరైనా పావలా అర్ధా పడవేస్తే - దాన్ని ముట్టుకోడు. 'పాపం ముసలి వాడు, ఆకలితో చచ్చిపోతా'డని జాలిపడి పండో, ఫలహారమో ఇస్తే ఆరగించడు. పిచ్చిచూపులే అన్ని టికీ జవాబు!

అతని శరీరం మూడురోజుల ఉపవాసానికి గడ్డిపోచల్లో ఒక పోచగా, ఎండుటాకుల్లో ఒక ఆకు గా తయారైంది. అతని నేత్రాలు ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న జ్యోతుల్లా ఉన్నాయి. అతని ముఖం రంగుపులిమిన పుర్రెలా ఉంది. అతని కడుపు ఎండి పోయి, వంచిన విల్లులా ఉంది. మూడుపగళ్లూ, మూడు రాత్రులూ ఆకలితో, చలితో పోరాడుతూ - ఆ మర్రిచెట్టు కిందినుంచి కదలనైనా లేదు.

నాలుగోరోజు ఉదయం గొణుగుకోడానికైనా అతనికి శక్తి లేకపోయింది. ఏడ్చే ఓపిక కూడా చచ్చి పోయింది. చుట్టూ జనం గుమిగూడారు. "ఎక్కడ పుట్టాడో, ఎంతబతుకు బతికాడో - పాపం, ఇక్కడి కొచ్చి దిక్కులేనిచావు చావాలని అడిగి వచ్చినాడు ..." అంటూ అందరూ సానుభూతి ప్రకటించారు. ఆ జనసమూహాన్ని చీల్చుకొని ఒక యువకుడు అతని దగ్గరకు వచ్చాడు. అంద రూ విభ్రాంతితో చూస్తున్నారు. ఆ యువకుడు వృద్ధుణ్ని బస్సులోకి చేరవేశాడు. ఇదేమీ ఆ ముసలివాడికి తెలియదు.

* * *

మరణశయ్యమీద చివరిసారిగా కళ్లుతెరిచి చూశాడు తిమ్మరాజు. విషాదవదనంతో చేతులు కట్టుకొని నిలబడి ఉన్న తన కొడుకు గోపాలం, కన్నీరు మున్నీరుగా ఏడుస్తోన్న అర్ధాంగి మీనాక్షీ మసకమసకగా కనిపించారు. నోరు తెరిచి ఏదో చెప్పబోయాడు. నోరు పెగలలేదు. చేతులెత్తి మొక్కబోయాడు. చేతులు కదలలేదు. నయనా ల్లోని అశ్రుభాండాలు బద్దలై, అతని శుష్కవదనం మీద కన్నీరు మాత్రం ధారగా స్రవించి, మరునిమి షంలోనే ఆగిపోయింది. అతను వెళ్లిపోయాడు - తనవారికి ఇంకా దూరంగా, శాశ్వతంగా.

పాపం, తిమ్మరాజు!

స్వహస్తాలతో అందమైన పూలదండలు కోకొల్లలు అల్లిన పూల తిమ్మరాజు తన జీవిత సుమహారాన్ని కూర్చి కట్టుకోలేకపోయాడు!

